సాక్షి బాపట్ల

శనివారం । 28 । అక్టోబర్ । 2023



బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ
నరసరావుపేట: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో డిసెంబర్ 8, 9 తేదీలలో నిర్వహించే పల్నాడు బాలోత్సవం పోస్టర్‌ను కలెక్టర్ శివశంకర్ శుక్రవారం ఆవిష్కరించారు.



వైద్య విద్యార్థులకు అభినందన
గుంటూరు మెడికల్: ఇంటర్ కాలేజ్ గేమ్స్‌లో సత్తాచాటిన గుంటూరు వైద్య కళాశాల విద్యార్థులను శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి అభినందించారు.



కొనసాగుతున్న భవానీల రద్దీ
విజయవాడ : ఇంద్రకీలాద్రిపై భవానీల రద్దీ కొనసాగుతోంది. దూర ప్రాంతాల నుంచి వస్తున్న భవానీలు పుణ్యస్నానాలు ఆచరించి, భక్తితో దీక్షల విరమణ చేస్తున్నారు.

న్యూస్‌రీల్

నేడు అమరేశ్వరాలయం మూసివేత

అమరావతి: చంద్రగ్రహణం నేపథ్యంలో ఈనెల 28న శనివారం రాత్రి 7 గంటలకు అమరేశ్వరాలయాన్ని మూసివేస్తామని ఈఓ వేమూరి గోపినాథశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాక్షిక చంద్రగ్రహణం కారణంగా ఆలయాన్ని శనివారం 6.30 గంటలకు స్వామి ఏకాంతసేవలు ముగిసిన అనంతరం 7 గంటలకు మూసివేస్తామని పేర్కొన్నారు. పాక్షిక చంద్ర గ్రహణానికి పట్టు, విడుపు కాలాలను కలుపుకుని ఈనెల 29న ఉదయం దేవాలయం తెరిచి స్వామి వారికి తిరువంజన సేవ, సంప్రోక్షణ ప్రత్యేక పూజల అనంతరం 9.30 గంటలకు భక్తులకు దర్శనం కల్పిస్తామని వివరించారు.

నేడు సీనియర్ ఉమెన్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలో సీనియర్ ఉమెన్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు కుమ్మరి క్రాంతి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ ఆధారంగా జిల్లా జట్టును ఎంపిక చేసి వచ్చేనెల 2, 3 తేదీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న అంతర్ రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 96429 31771ను సంప్రదించాలన్నారు.

ముగ్గురికి ఏవోలుగా పదోన్నతి

గుంటూరు మెడికల్ : ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త కార్యాలయ పరిధిలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ముగ్గురికి శుక్రవారం పరిపాలన అధికారులుగా పదోన్నతి లభించింది. వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. బాపట్ల ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న మాణిక్యారావుకు అక్కడే ఏఓగా ప్రమోషన్ ఇచ్చారు. సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న మెహరున్నీసాకు ఏవోగా ప్రమోషన్ ఇచ్చి చిలకలూరిపేట బదిలీ చేశారు. చిలకలూరిపేటలో పనిచేస్తున్న విజయలక్ష్మికి ఏఓగా ప్రమోషన్ ఇచ్చి చీరాల బదిలీ చేశారు.

153 బస్సులపై కేసులు నమోదు

గుంటూరు ఈస్ట్ : దసరా పండగ సందర్భంగా కాంట్రాక్టు క్యారేజీ బస్సులపై చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 153 బస్సులపై కేసు నమోదు చేసినట్లు ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ శుక్రవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మోటారు వాహన తనిఖీ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారన్నారు. ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక తనిఖీలు చేపట్టగా, కాజ టోల్‌ప్లాజా, పేరేచర్ల జంక్షన్‌ల వద్ద 153 బస్సులు నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్నట్లు గుర్తించి ఆ బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు.

ఏకోనాంపేటలో కార్డన్ సెర్చ్



విజయపురిసౌత్: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మాచర్ల మండలంలోని ఆంధ్రప్రదేశ్ బోర్డర్ గ్రామమైన ఏకోనాంపేటలో శుక్రవారం రాత్రి మాచర్ల రూరల్ సీఐ ఎస్‌కె సమీముల్లా ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు అక్రమ మద్యం, నగదు ఇతర వస్తువులు రాకుండా కార్డన్‌సెర్చ్ చేపట్టారు. నాగార్జున సాగర్ బోర్డర్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల రూరల్ ఎస్ఐ కె రాజశేఖర్, సాగర్ ఏఎస్ఐ ఎస్‌కె మస్తాన్‌వలి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 4,227 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 212, బ్యాంక్ కెనాల్‌కు 1,102, తూర్పు కెనాల్‌కు 630, పశ్చిమ కెనాల్‌కు 165, నిజాంపట్నం కాలువకు 338, కొమ్మమూరు కాల్వకు 1,217 క్యూసెక్కులు వదిలారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 525.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 23,765, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 845.30 అడుగుల వద్ద ఉంది.

సామాజిక జయభేరి

- నేడు బాపట్లలో వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- పిట్టలవానిపాలెం మండలం నంగుపాలెం నుంచి ప్రారంభం
- పార్టీ శ్రేణుల్లో ఉరకలెత్తుతున్న ఉత్సాహం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర శనివారం బాపట్ల నియోజకవర్గంలో జరగనుంది. ఉదయం 11 గంటలకు పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెంలో యాత్ర ప్రారంభం కానుంది. అక్కడి నుంచి కర్లపాలెం మండలం మీదుగా బాపట్ల రూరల్, టౌన్ ప్రాంతాల్లో యాత్ర సాగనుంది. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బహిరంగసభ నిర్వహించనున్నారు. యాత్రలో భాగంగా దేవాలయాలు, మసీదులు, చర్చిలతోపాటు మనబడి నాడు–నేడులో భాగంగా అభివృద్ధి చేసిన పాఠశాలలను ప్రజాప్రతినిధులు సందర్శిస్తారు. వీటితోపాటు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను నేతల బృందం పరిశీలించనుంది. పలుచోట్ల వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించనుంది. గ్రామాల్లో బైక్‌ర్యాలీలు, పాదయాత్రలు జరగనున్నాయి. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో యాత్ర సాగనుంది. యాత్రలో రాజ్యసభ సభ్యులు, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు పలువురు ప్రముఖ నేతలు పాల్గొననున్నారు.



సాధికార యాత్రతో జోష్..

సామాజిక సాధికారత యాత్రతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం ఉరకలెత్తుతోంది. యాత్రకు గ్రామాల్లో స్వాగతం పలికేందుకు కార్యకర్తలు సంసిద్ధులవుతున్నారు. వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుల,మతాలకతీతంగా అర్హులైన అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలను అందజేస్తోంది. దీంతోపాటు అన్ని సామాజికవర్గాలకూ రాజకీయంగా ప్రాధాన్యమిచ్చింది. ఎదుగుదలకు విశేష కృషి చేస్తోంది. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతికి పాటుపడుతోంది. దీనివల్ల సామాజిక సాధికారత సాధ్యమవుతోంది. ఫలితంగా జగన్ పాలనలో అన్నివర్గాలవారూ సంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్ సీపీ సామాజిక సాధికారత పేరుతో బస్సుయాత్ర నిర్వహిస్తోంది. ఇతర జిల్లాల్లో ఇప్పటికే ప్రారంభమైన ఈ యాత్రకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోంది. జనం స్వచ్ఛందంగా తరలివస్తున్నారు. విజయసాయిరెడ్డి రీజినల్ కో–ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టాక బాపట్లలో నియోజకవర్గాలవారీ సమావేశాలు నిర్వహించారు. దీంతో పార్టీశ్రేణుల్లో నయా జోష్ నెలకొంది. తాజాగా బస్సు యాత్రతో ఈ ఉత్సాహం రెట్టింపయింది. ఫలితంగా కార్యకర్తలు, నేతలు జయభేరి మోగించనున్నారు.

బస్సు యాత్ర సాగుతుందిలా..

- శనివారం ఉదయం 11.45 గంటల నుంచి 11.55 గంటల వరకు పిట్టలవానిపాలెం మండలం, సంగుపాలెంలో మహానేతల విగ్రహాల వద్ద నివాళి
- 12 గంటల నుంచి 12.20 గంటల వరకు చందోలులోని బగళాముఖి ఆలయం సందర్శన
- 12.30 గంటల నుంచి ఒంటి గంట వరకు పెద్దమసీదు సందర్శన
- 1.05 గంటల నుంచి 2.45 గంటల వరకు చందోలులో జెడ్పీహైస్కూల్‌లో మనబడి నాడు–నేడు పనుల పరిశీలన, భోజన విరామం, ప్రెస్‌మీట్
- 2.45 గంటల నుంచి 3.45 గంటల వరకు చందోలు నుంచి బుద్దాం మీదుగా కర్లపాలెం వరకు యాత్ర. కర్లపాలెం ఐలాండ్ సెంటర్‌లో సభ
- 3.45 గంటల నుంచి 4.30 గంటల వరకు కర్లపాలెం నుంచి నందిరాజుతోట మీదుగా బాపట్ల టౌన్ వరకు బైక్‌ర్యాలీ, బస్సుయాత్ర
- 4.30 గంటల నుంచి 5.15 గంటల వరకు పట్టణంలోని ప్యాడిసెన్ పేట నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు పాదయాత్ర, ఏబీఎం సెర్చ్ పరిశీలన, ఆటో, ట్యాక్సీ డ్రైవర్లతో మాటామంతి
- 5.15 గంటల నుంచి 6.45 గంటల వరకు బాపట్ల అంబేడ్కర్ సర్కిల్‌లో బహిరంగ సభ

వందే నవతరం

- ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
- ప్రతి నియోజకవర్గంలోనూ మహిళలదే ఆధిక్యం
- గతం కంటే 15,521 ఓట్లు అధికం
- పురుషుల కంటే 28,866 మంది మహిళా ఓటర్లు ఎక్కువ
- అద్దంకిలో అత్యధికంగా 2,36,802 ఓట్లు
- బాపట్లలో అత్యల్పంగా 1,84,057 ఓట్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లా కొత్త ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైంది. కలెక్టర్ రంజిత్ బాషా శుక్రవారం సాయంత్రం జాబితాను విడుదల చేశారు. తాజా గణాంకాల ప్రకారం జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 12,63,132 మంది ఓటర్లు ఉన్నారు. 2023 జనవరిలో విడుదలైన ఓటర్ల జాబితా ప్రకారం జిల్లా వ్యాప్తంగా 12,47,611 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 12,63,132కు పెరిగింది. ఈ లెక్కన గతంతో పోలిస్తే 15,521 మంది ఓటర్లు పెరిగారు. జిల్లాలో పురుషులకంటే స్త్రీల ఓట్లు 28,866 అధికంగా ఉన్నాయి. మొత్తం ఓట్లలో 6,17,096 పురుషుల ఓట్లు ఉండగా 6,45,962 స్త్రీ ఓట్లు ఉండడం గమనార్హం. అత్యధికంగా అద్దంకి నియోజకవర్గంలో 2,36,802 ఓట్లు ఉండగా బాపట్ల నియోజకవర్గంలో అతి తక్కువగా 1,84,057 ఓట్లు ఉన్నాయి. గతంతో పోలిస్తే వేమూరు నియోజకవర్గంలో 3,237 ఓట్లు పెరగగా చీరాలలో 3,138, అద్దంకిలో 2,921, బాపట్లలో 2,819, పర్చూరులో 1,947 , రేపల్లెలో 1,459 చొప్పున ఓట్లు పెరిగాయి. ఇక గతంలో ట్రాన్స్‌జెండర్ ఓట్లు 78 ఉండగా తాజా జాబితా ప్రకారం 4 ఓట్లు తగ్గడంతో మొత్తం 74 ఓట్లు మాత్రమే ఉన్నాయి.

నామమాత్రంగా పెరిగిన ఓట్లు

తాజా జాబితా ప్రకారం ఓట్లు స్వల్పంగా పెరిగినట్లు తెలుస్తోంది. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కేవలం 15,521 ఓట్లు మాత్రమే పెరిగాయి. ఇటీవల జిల్లాలో దొంగ ఓట్లు అధికంగా ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు జిల్లా అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి దొంగ ఓట్లతోపాటు చనిపోయినవారి ఓట్లను తొలగించారు. దీంతో ఓట్ల పెరుగుదల పెద్దగా కనిపించలేదు. ఎన్నికల సమయం వరకు ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులకు అవకాశం ఉంటుంది.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్	మొత్తం
వేమూరు	94,146	99,701	07	1,93,854
రేపల్లె	1,10,740	1,14,940	25	2,25,705
బాపట్ల	89,639	94,414	04	1,84,057
పర్చూరు	1,10,706	1,16,372	08	2,27,086
అద్దంకి	1,16,342	1,20,448	12	2,36,802
చీరాల	95,523	1,00,087	18	1,95,628
మొత్తం	6,17,096	6,45,962	74	12,63,132



కుడి జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలించిన ఏపీజెన్‌కో సీఈ

విజయపురిసౌత్: ఏపీ జెన్‌కో శ్రీశైలం కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ డీవీఎస్ఎస్ఎల్ కాంతారావు శుక్రవారం నాగార్జున సాగర్ కుడి జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. ముందుగా జలవిద్యుత్ కేంద్రంలో జరుగుతున్న పెన్ స్టాక్ సర్వీస్ మొదటి యూనిట్ గేట్ మరమ్మతు పనులను పరిశీలించారు. పెన్ స్టాక్ గేట్ పనులను నవంబర్ 10లోపు పూర్తి చేయాలని ఈఈ వైఎస్ ఆర్‌కే ప్రసాద్‌తో చెప్పారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఈఈ 327 యూనియన్ ఆధ్వర్యంలో సీఈ కాంతారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఈ రాజారెడ్డి, యూనియన్ అధ్యక్షుడు ఎం.సాంబశివరావు, కార్యదర్శి బి.సూరజ్‌చంద్ పాల్గొన్నారు.



ఏపీజెన్‌కో సీఈ కాంతారావును సన్మానిస్తున్న సాగర్ కుడిజలవిద్యుత్ కేంద్రం ఈఈ ప్రసాద్, ఉద్యోగులు

యార్డులో 17,807 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 17,006 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 17,807 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.13,500 నుంచి రూ.22,000 వరకు పలికింది.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

చీరాల అర్బన్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ పేర్కొన్నారు. వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్శిటీ స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. పోటీలకు యూనివర్శిటీ పరిధిలోని పలు కాలేజీల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా డాక్టర్ ఐ.బాబూరావు, డాక్టర్ ఎస్.కొండలరావు, ఎం.దినకర్, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మధుసూదనరావు హాజరయ్యారు. పోటీల్లో చీరాల వీఆర్ఎస్‌వైఆర్ఎన్ కాలేజీ విద్యార్థి పి.ఆదిత్య, వై.సల్మాన్ (ఏఎన్‌యూ), వై.రవీంద్రారెడ్డి, ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీ, బి.సాయి ప్రశాంతి, ప్రియదర్శిని కాలేజీ, తెనాలి, జీఎస్ఎన్ సాయిప్రియ, గౌతమి కాలేజీ, చీరాల గోల్డ్ మెడల్స్ సాధించారని పేర్కొన్నారు. ఐదుగురు విద్యార్థులు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ తరఫున నవంబర్ 2న రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొంటారని యూనివర్శిటీ అబ్జర్వర్ శేషగిరిరావు తెలిపారు. కార్యక్రమాన్ని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జీపీ నీలాకుమారి నిర్వహించారు.



గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు

తప్పిపోయిన విద్యార్థులు తల్లిదండ్రుల చెంతకు

5 గంటల వ్యవధిలో అప్పగించిన పోలీసులు

ఇంకొల్లు (చినగంజాం): తప్పిపోయిన విద్యార్థుల ఆచూకీని కొన్ని గంటల్లోనే కొనుగొన్న పోలీసులు వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఇంకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను సంప్రదించారు. ఇంకొల్లు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లిదండ్రులు అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో ఇంకొల్లు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ ఎస్‌కే నాయబ్ రసూల్‌ను కలిసి సమస్య వివరించారు. వెంటనే స్పందించిన ఎస్ఐ ఎస్పీ వకుల్ జిందాల్‌కు సమాచారం అందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. వారిలో ఒక బృందం తోటి విద్యార్థులను విచారించగా, రెండో బృందం బహిరంగ ప్రదేశాల్లో గాలించారు. మూడో బృందం సీసీ కెమెరాలను పరిశీలించగా ఇంకొల్లు బస్టాండ్‌కు వెళ్లినట్లు తెలిసింది. పర్చూరు పోలీసు స్టేషన్ గస్తీ సిబ్బంది పర్చూరు బస్టాండ్‌లో 27వ తేదీ శుక్రవారం వేకువ జామున నాలుగు గంటలు సమయంలో విద్యార్థులను గుర్తించి ఇంకొల్లు ఎస్ఐకు సమాచారం అందించారు. ఎస్ఐ నాయబ్ రసూల్ ముగ్గురు విద్యార్థులను ఇంకొల్లు పోలీస్ స్టేషన్‌కు రప్పించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. గంటల వ్యవధిలో విద్యార్థుల ఆచూకీ కనుగొన్న ఎస్ఐ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి బంధువులు ఎస్పీ, ఇంకొల్లు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.




విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

విహారయాత్రలో విషాదం

- రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు యువకులు మృతి
- మృతుల్లో ఒకరు బాపట్ల జిల్లా వాసి

మహానంది: విహారయాత్రలకు మిత్రులంతా కలిసి వచ్చారు. శ్రీశైలంలో మల్లికార్జున స్వామి దర్శనం ముగించుకుని అందరూ మధ్యలో భోజనాలు చేసి సరదాగా కబుర్లు చెప్పుకుని బయల్దేరారు. ఐదు బైక్‌లపై సుమారు పది మంది మహానందికి వస్తుండగా బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామ సమీపంలోని ప్రభాత్ కాలేజీ వద్ద ఎదురుగా వస్తున్న ఓ బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ దుర్ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. బండిఆత్మకూరు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన కరీం, రఫీ, మస్తాన్‌తో పాటు మరి కొంత మంది యువకులు విహారయాత్ర కోసం గురువారం బయల్దేరి శ్రీశైలం వెళ్లారు. శ్రీశైలంలో దర్శనం ముగించుకుని మహానంది వెళ్తుండగా ప్రభాత్ కాలేజీ సమీపంలో కరీం(22), రఫీ వెళ్తున్న బైక్ ఎదురుగా వస్తున్న వెలుగోడు మండలం బోయరేవుల గ్రామానికి చెందిన డేవిడ్(26) బైక్ ఢీకొన్నాయి. కరీం, డేవిడ్ ఘటనాస్థలంలో మరణించారు. రఫీ గాయపడ్డాడు. డేవిడ్ నంద్యాలకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.



కరీం (ఫైల్‌ఫొటో)

రైతు శ్రేయస్సుతోనే దేశ క్షేమం

- రాజన్న, జగనన్నలే రైతు బాంధవులు
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు స్పష్టీకరణ
- అట్టహాసంగా రేపల్లె మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ యార్డు కొత్త కమిటీ సభ్యులు, చిత్రంలో మోపిదేవి వెంకటరమణారావు

రేపల్లె రూరల్: రైతులు క్షేమంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని, నాడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిలానే నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కర్షకులకు అండగా నిలుస్తూ రైతు బాంధవులుగా పేరొందారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు కొనియాడారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి మోపిదేవి అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ నిరంతరం కట్టుబడి ఉంటుందన్నారు. తీర ప్రాంతంలోని రైతుల సంక్షేమం కోసం పలు ఎత్తిపోతల పథకాలను అందుబాటులోకి తెచ్చినట్టు వివరించారు. నిత్యం గ్రామీణ ప్రాంతాలలో రైతు భరోసా కేంద్రాల ద్వారా అనేక సేవలు అందిస్తున్నట్టు వెల్లడించారు. రేపల్లె పట్టణంలో రూ.2 కోట్లతో రైతు బజారుకు శంకుస్థాపన చేశామన్నారు. రైతుభరోసా ఆర్థిక సాయం కర్షకులకు ఆసరాగా నిలుస్తోందని వివరించారు.

హరితాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత వైఎస్సార్‌దే

మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతోందన్నారు. కృష్ణాడెల్టా ప్రాంతాన్ని సస్యశామలం చేసేందుకు ఆనాడు రాజన్న ప్రారంభించిన పులిచింతల ప్రాజెక్ట్ ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో పులిచింతల ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు రైతాంగానికి జీవం పోస్తోందన్నారు. నేడు ముఖ్యమంత్రి జగనన్న రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. రేపల్లె ప్రాంత ప్రజలకు సుపరిచితులైన మోపిదేవి వెంకటరమణారావు సీఎం జగనన్నకు అత్యంత ఆప్తులని వివరించారు. మోపిదేవికి ప్రజలు, రైతులు అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి మార్కెట్ యార్డు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత బస్టాండ్ సెంటరులోని వైఎస్సార్ విగ్రహానికి ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏఎంసీ కమిటీ సభ్యులు వీరే

పట్టణ మార్కెటింగ్ యార్డ్ కార్యాలయ ఆవరణలో మార్కెట్ యార్డ్ కమిటీ కొత్త కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. సభ్యులతో మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ అధ్యక్షుడిగా దేవగిరి సాంబశివరావు, వైస్‌చైర్మన్‌గా ఉల్లంఘుంట శ్రీరామమూర్తి, సభ్యులుగా గొరకపూడి కన్నయ్య, కొడాలి రంగనాయకులు, బర్మా కృష్ణమూర్తి, జడల లక్ష్మి, షేక్ ముక్తియార్‌బేగం, వుయ్యూరు రమాదేవి, అక్కల వెంకట కుమారి, అన్నపరెడ్డి రమాదేవి, పెనుమూడి పూర్ణకుమారి, బడుగు యేసుప్రేమ, నేరెళ్ల కాశీ, ఆలపాటి రామకృష్ణ, వేజళ్ల ధనుంజయరావు, పుట్టగుంట బుచ్చిరామయ్య ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, నగరం ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య, నాగలక్ష్మి, మత్రివాడ వెంకట పావని, పార్టీ మండల అధ్యక్షులు గాదె వెంకయ్యబాబు, పయనం ఏడుకొండలురెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్‌లు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2500, గరిష్ట ధర రూ.4200, మోడల్ ధర రూ.3500 వరకు పలికింది.



లడ్డూ విక్రయాల్లో రికార్డు

విజయవాడ : దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై నిర్వహించిన దసరా ఉత్సవాల, ఆ తర్వాత మూడు రోజులలో మొత్తం 25 లక్షలకు పైగా లడ్డూల విక్రయాలు జరిగాయి. గడిచిన మూడేళ్లలో ఇదే రికార్డు అని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాది ఉత్సవాలు, ఆ తర్వాత భవానీల రద్దీ మొత్తం కలిపి 24.48 లక్షల లడ్డూలను విక్రయిస్తే, 2021 దసరా ఉత్సవాల్లో 15.79 లక్షల లడ్డూల విక్రయాలు మాత్రమే జరిగాయి. దసరా ఉత్సవాల ప్రారంభం నుంచే ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, చైర్మన్ కర్నాటి రాంబాబు, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావులు లడ్డూ తయారీపై నిరంతరం పర్యవేక్షిస్తూ, లడ్డూ ప్రసాదాల నాణ్యతను పరిశీలించారు. ఇక భక్తులు కోరినన్ని లడ్డూలను ఇవ్వాలనే సంకల్పంతో అధికారులందరూ కలిసి పనిచేయడంతో ఎటువంటి ఫిర్యాదులు లేకుండా లడ్డూలను తయారు చేసి భక్తులకు అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది దసరా ఉత్సవాలు ముగిసిన తర్వాత కూడా లడ్డూ కౌంటర్లు 24 గంటలు పని చేసి భక్తులకు, భవానీలకు లడ్డూలను అందజేశారు.



లడ్డూలను ప్యాకింగ్ చేస్తున్న కార్మికులు

క్లుప్తంగా

నేడు శింగరకొండ దేవస్థానం మూసివేత

అద్దంకి రూరల్: జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం చంద్ర గ్రహణం సందర్భంగా శనివారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి ఆదివారం ఉదయం 5 గంటల వరకు ఆలయాన్ని మూయనున్నట్లు దేవస్థాన కార్యనిర్వాహ ణాధికారి సుభద్ర శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరిగి ఆదివారం ఉదయం 5 గంటలకు సంప్రోక్షణ చేస్తారన్నారు. అనంతరం నిత్యాభిషేక కార్యక్రమం, తదుపరి ఉదయం 8 గంటల నుంచి భక్తులను యథావిధిగా స్వామివారి దర్శనం కల్పించనున్నట్లు ప్రకటనలో తెలిపారు.

ఉపాధ్యాయుడి ప్రవర్తనపై నివేదిక అందించండి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్

బాపట్ల: పట్టణంలో ప్రాథమిక పాఠశాలలో జరిగిన సంఘటనపై తక్షణమే నివేదిక సమర్పించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాపట్ల పట్టణ ప్రాథమిక పాఠశాలలో జరిగిన సంఘటనను తీవ్రంగా ఖండించారు. పాఠశాలలో బాలికపై జరిగిన సంఘటనపై పూర్తిగా విచారించి మూడు రోజుల్లో నివేదికను అందించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. నివేదిక ఆధారంగా విచారణ జరిపి బాలికలపై అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికలపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు.

ఆదాయంలో వినుకొండ డిపో ప్రథమస్థానం

వినుకొండ(నూజెండ్ల): జిల్లాలోనే ఆర్టీసీ వినుకొండ డిపో ఆదాయం ప్రథమస్థానం సాధించినట్లు డిపో మేనేజర్ ఎం.కోటేశ్వరరావునాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ దసరా వేడుకలు అనంతరం వినుకొండ డిపోకు అదనంగా రూ.21.82లక్షల ఆదాయం వచ్చిందన్నారు. డిపోకు చెందిన 100 ఆర్టీసీ బస్సులు 40వేల కిలోమీటర్లు తిరిగాయని, ప్రయాణికులకు మెరుగైన సేవలు సకాలంలో పారదర్శకంగా అందించామన్నారు. జిల్లాలోనే అత్యధిక ఆదాయం వచ్చేలా కృషి చేసిన ఆర్టీసీ సిబ్బందికి, అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు. డిపో ఆదాయం పెంపునకు ఉద్యోగులు కృషి చేయాలని కోరారు.

జగనన్నకు చెబుదాంతో ప్రజల ముందుకే యంత్రాంగం

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం ద్వారా పరిపాలన యంత్రాంగం ప్రజల వద్దకు వచ్చిందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణరావు అన్నారు. పట్టణంలోని ప్రత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను జిల్లా కలెక్టర్ స్వయంగా స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించేందుకు ఇదొక చక్కని వేదికన్నారు. ప్రజలకు నివాస స్థలాలు, రేషన్ కార్డుల వంటి సుదీర్ఘకాల సమస్యలన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ద్వారా శాశ్వతంగా పరిష్కారం అయ్యాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సచివాలయాల సిబ్బంది ప్రజలకు మంచి సేవలందిస్తూ ప్రజల నుంచి వస్తున్న అర్జీలను సత్వరమే పరిష్కరిస్తున్నారని తెలిపారు. ప్రజల వద్దకే యంత్రాంగం వచ్చి స్పందన కార్యక్రమం నిర్వహించడం ద్వారా సమస్యలన్నీ పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఇలాంటి కార్యక్రమాల నిర్వహించడం ద్వారా ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారని చెప్పారు. ప్రజల నుంచి వస్తున్న అర్జీలను అధికారులు పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్నకు చెబుదాం పోర్టల్ కింద పట్టణ ప్రాంతం నుంచి 113 అర్జీలు, గ్రామీణ ప్రాంతాల



అర్జీ పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, పక్కన రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

నుంచి 198 అర్జీలు నమోదయాయని తెలిపారు.

అర్జీల పునరావృతంపై అసహనం

ప్రజల నుంచి అందిన అర్జీలలో 16 పునరావృతం కావడంపై కలెక్టర్ రంజిత్‌బాషా అసహనం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారుల పనితీరు సరిగా లేదన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకుండా క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఏం చేస్తున్నారని నిలదీశారు. వ్యవసాయ శాఖలో 8 అర్జీలు పునరావృతం కాగా, మునిసిపాలిటీలో రెండు, రెవెన్యూలో రెండు, మిగిలినవి వివిధ శాఖలకు చెందినవని తెలిపారు.

నూరుశాతం గృహాలు నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలి

రేపల్లె పట్టణంలో 2,376 పక్కా గృహాలు మంజూరయ్యాయన్నారు. అందులో 1,168 పక్కా గృహాలు పూర్తికాగా మిగిలినవి వివిధ దశల్లో ఉండడంపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులను చైతన్యపర్చి ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందేలా సహకరించాలని కోరారు. ఇళ్ల నిర్మాణంపై అశ్రద్ధ వహించరాదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, ఆర్డీఓ హెలా షారోన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్ట మంగ, కమిషనర్ విజయసారథి, తహసీల్దార్ మల్లికార్జునరావు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



రక్తదానం చేస్తున్న సిబ్బందిని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ గుంటూరులోని 'థలసేమియా నీడ్స్ బ్లడ్ సెంటర్ సారథ్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, జిల్లాలోని పౌరులు, ఆటో డ్రైవర్లు మొత్తం 174 మంది రక్తదానం చేశారన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను చిహ్నంగా రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. థలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి రక్తం అందిస్తుంటారన్నారు. థలసేమియా వ్యాధిగ్రస్తులకు శరీరంలో ఎర్ర రక్తకణాల సంఖ్యను పెంచడానికి ప్రతి 15 నుంచి 20 రోజులకు ఒకసారి తప్పనిసరిగా రక్తం ఎక్కిస్తూ ఉండాలన్నారు. మన దేశంలో రక్తపు నిల్వల కొరత ఉందని, మనం దానం చేసే ప్రతి ఒక్క 'రక్తపు బిందువు' మరొకరికి ప్రాణం పోసే 'అమృత బిందువు' అవుతుందన్నారు. రక్తదానం విషయంలో అపోహలు పడవద్దని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం మంచిదన్నారు. అనంతరం రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి పండ్లు, జ్యూస్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్ బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, ఎస్బీ సీఐ వి.సూర్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మథరావు, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్‌నాయక్, హోంగార్డ్ ఆర్ఐ ఎల్.గోపీనాథ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను యుక్తధార యాప్‌లో అప్‌లోడ్ చేయాలి

డ్వామా పీడీ శంకర్ నాయక్



మాట్లాడుతున్న డ్వామా పీడీ శంకర్ నాయక్

చెరుకుపల్లి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులు గుర్తించి యుక్తధార యాప్‌లో అప్‌లోడ్ చేయాలని డ్వామా పీడీ శంకర్‌నాయక్ ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని 12మండలాల ఎన్ఆర్ఈజీఎస్ టీఎలు, జేఈలు, ఈసీలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శంకర్‌నాయక్ మాట్లాబుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు 2024–25 సంవత్సరానికి గుర్తించి తప్పనిసరిగా యుక్తధార యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామాల్లో ఆసక్తి గల ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులు అందించి ఎక్కువ పనిదినాలు పని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మండలాల్లో ఎక్కువ పనులు గుర్తించి డిసెంబర్ చివరికల్లా అనుమతులు పొందే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సువార్త, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జి.మహేశ్వరరెడ్డి, వేదికపై మలికార్జునరెడ్డి, వెంకటరమణ తదితరులు

గుంటూరు ఈస్ట్: వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.మహేశ్వరరెడ్డి, కార్యదర్శి మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. పలు జిల్లాలకు చెందిన ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్, ఏపీ ట్రాన్స్‌కోకు చెందిన యూనియన్ నాయకులు హాజరయ్యారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులకు ప్రభుత్వం 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ ఏరియర్స్ విడుదల చేయాలని కోరారు. జేఎల్ఎమ్–2 ఆర్డర్ ఇచ్చి ఇంక్రిమెంట్లు విడుదల చేయాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు పీఆర్సీ ఎరియర్స్ ఇవ్వాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 1999 నుంచి 2004 వరకు ఉన్న ఉద్యోగులకు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్చాలని కోరారు. ఏపీ జన్‌కోకు సంబంధించి 2018 నాటికి చంద్రబాబు ఆర్టీపీపీని నిర్వీర్యం చేశారని, ఫలితంగా ఉద్యోగులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీపీపీని పునః ప్రారంభించి కరోనా నేపథ్యంలో బొగ్గు సంక్షోభం ఉన్నా, మూడు రెట్ల వ్యయంతో బొగ్గు నిల్వలు కొనుగోలు చేసి ఉద్యోగులను ఆదుకోవడంతో పాటు, మెరుగైన విద్యుత్ అందించారని గుర్తు చేశారు. విద్యుత్ ఉద్యోగులు మరింత ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు.

కార్యక్రమంలో రాష్ట్ర చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పి.వెంకటరమణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.బాలాజీ, గుంటూరు జిల్లా రీజనల్ ప్రెసిడెంట్ ఎస్.ఎస్.అలి, రీజనల్ కార్యదర్శి శివరామిరెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రశేఖర్, రాజేంద్రకుమార్, పున్నారావు, వై.రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



మహాలక్ష్మి

చీరాల టౌన్: సౌత్‌జోన్ పోటీల్లో చీరాల విద్యార్థిని ప్రతిభ చూపి మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీలు అక్టోబర్ 15 నుంచి 17 వరకు తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా హన్మకొండలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగాయి. పోటీల్లో చీరాల చైతన్య భారతీ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మొదటి ఏడాది చదువుతున్న పాలవలస మహాలక్ష్మి ప్రతిభ చూపి కాంస్య పతకాన్ని సాధించింది. శుక్రవారం కళాశాలలో జరిగిన అభినందన సభలో కళాశాల యాజమాన్యం కాంస్య పతకం సాధించిన మహాలక్ష్మిని అభినందించి సత్కరించింది. కళాశాల యాజమాన్యం రాంబాబు, సురేష్, ఉమ్రాన్, ప్రిన్సిపాల్ సోమేశ్వరరావులు మాట్లాడారు. దక్షిణాది రాష్ట్రాల పరిధిలో హన్మకొండలో నిర్వహించిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో తమ విద్యార్థిని మహాలక్ష్మి 4 400 రిలే పోటీల్లో ప్రతిభచూపి కాంస్య పతకం సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలి

జిల్లా వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ సత్తార్



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ సత్తార్

వేటపాలెం: రైతు భరోసా కేంద్రాల్లో అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ సత్తార్ సూచించారు. మండలంలోని దేశాయిపేట–4 రైతు భరోసా కేంద్రంలో వీఏఏ, వీహెచ్ఏ, ఏఈఓలకు శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ–క్రాప్‌కి సంబంధించిన జాబితాలను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఉంచాలని ఆదేశించారు. గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటుచేసి ఈ–క్రాప్ జాబితాల్లో రైతుల పేర్లు చదివి వినిపించాలన్నారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతు చేత ఈ–క్రాప్ నమోదు చేయించే బాధ్యత సిబ్బందిపైనే ఉంటుందన్నారు. ఎన్‌పీసీఐలో ఇనాక్టివ్ కేసెస్‌ని పోస్టాఫీస్‌లో ఖాతా తెరిపించాలని తెలిపారు. ప్రతి క్రాప్‌లో విధిగా పంటకోత ప్రయోగాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలయకుడు ఎప్రాయం, చీరాల, వేటపాలెం ఏఓలు సుమతి, ఐ.కాశీవిశ్వనాథ్, సరిత పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈడీ శామ్యూల్ ఆనంద్

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవయంతో తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించవచ్చని ఇండో- జర్మన్ గ్లోబల్ ఆగ్రో రీసెర్చ్ లెర్నింగ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐ.శామ్యూల్‌ఆనంద్ తెలిపారు. జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ రైతు శాస్త్రవేత్తలకు రీజనల్ శిక్షణ కార్యక్రమం పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈడీ శామ్యూల్ ఆనంద్, రైతు సాధికార సంస్థ సైన్స్ టీం థిమాటిక్ లీడ్ ధర్మేంద్ర, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి పాల్గొన్నారు. శామ్యూల్ ఆనంద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో రైతుశాస్త్రవేత్తల పాత్ర ప్రధానమైనదని తెలిపారు. రైతు శాస్త్రవేత్తల కోసం ఒక కోర్సు తయారు చేసి ప్రకృతి వ్యవసాయ అనుభవం ఉన్న వారికి నాలుగేళ్ల పాటు శిక్షణ ఇచ్చి నిపుణులుగా తీర్చిదిద్దడం హర్షణీయమన్నారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమల కుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో సాంకేతికత నైపుణ్యాలు, పంట దిగుబడులు పెరిగేందుకు మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు డీపీఎం ప్రేమ్‌రాజ్, డీపీపీ భవాని రాజ్, సుష్మిత పాల్గొన్నారు.

బయో ఫర్టిలైజర్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు

రూ.7.91 లక్షల విలువైన మందులు స్వాధీనం



విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న బయో స్టిమ్‌లెంట్స్, నిందితుడు

గుంటూరు రూరల్: అనుమతులు లేకుండా బయోఫర్టిలైజర్స్ విక్రయిస్తున్న దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. ఏటుకూరు రోడ్డు బొంతలపాడు డొంకలో అనుమతులు లేకుండా బయో ఉత్పత్తులు తయారు చేసి అమ్ముతూ రైతులను మోసగిస్తున్నారని సమాచారంతో దాడులు నిర్వహించారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో పలు గోదాములు తనిఖీ చేపట్టారు. కోటపాటి కోటేశ్వరరావు, బయో స్టిమ్ లెంట్స్ కెమికల్ పెస్టిసైడ్స్‌తో కలిపి వ్యవసాయశాఖ అనుమతులు లేకుండా రా మెటీరియల్ తెచ్చి బయో స్టిమ్ లెంట్స్ తయారు చేయటం గుర్తించారు. అతను తయారు చేసిన బయో స్టిమ్ లెంట్స్ 321 లీటర్ల విలువ రూ.7.91 లక్షలు చేసే స్టిమ్‌లెంట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా బయో స్టిమ్‌లెంట్స్ తయారు చేస్తున్న వ్యక్తిపై కేసును నమోదు చేయాలని స్థానిక వ్యవసాయ అధికారిని విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీహరిరావు, అగ్రికల్చరల్ ఆఫీసర్ కె.రమణకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య పాల్గొన్నారు.

రేపటి వరకు ఈ-క్రాప్ సామాజిక తనిఖీ

కొరిటిపాడు(గుంటూరు): ఖరీఫ్ ఈ–క్రాప్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వంద శాతం ఈ–క్రాప్, 94.99 శాతం ఈ–కేవైసీ పూర్తి చేసిన వ్యవసాయశాఖ... జాబితాలపై ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు నాలుగు రోజులపాటు రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ(సోషల్ ఆడిట్)లు చేపట్టింది. ఎక్కడైనా పొరపాట్లు ఉంటే ఫిర్యాదుల ద్వారా పరిష్కరించనున్నారు. సామాజిక తనిఖీ తర్వాత ఈ నెల 30వ తేదీన తుది ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పంట రుణాల సున్నావడ్డీ, మద్దతు ధర ద్వారా పంట ఉత్పత్తుల అమ్మకాలు తదితర కార్యక్రమాలు ద్వారా రైతులకు లబ్ధి చేకూర్చడానికి ఈ–క్రాప్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్న నేపథ్యంలో దీనికి ప్రాధాన్యత నెలకొంది. అందుకోసం అర్హత కలిగిన ఒక్క రైతుకు కూడా అన్యాయం జరగకుండా ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 2.36,235.11 ఎకరాల్లో పంటలు సాగైనట్లు ఈ–క్రాప్‌లో నమోదు చేశారు. అందులో 85 వేల మంది రైతులు 2,24,335.57 ఎకరాల్లో(94.99 శాతం) ఈ–కేవైసీ చేయించుకున్నారు. ఈ నెల 29వ తేదీ వరకు జరిగే సామాజిక తనిఖీ ద్వారా రైతులందరూ తమ పంట, విస్తీర్ణం, ఇతరత్రా వివరాలు సరిచూసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న అధికారులు

జే.పంగులూరు: ప్రకృతి వ్యవసాయం వలన రైతులకు మంచి లాభం ఉంటుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం వాణిశ్రీ అన్నారు. మండల పరిధిలోని రామకూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న పంటలను అధికారులు శుక్రవారం పరిశీలించారు. రామకూరు గ్రామానికి చెందిన ఆంజనేయలు అనే రైతు తనకున్న 5 ఎకరాల పొలంలో మామిడి, జామతో పాటు బంతి, మినుము, మిరప, కొబ్బరి వంటి అంతర పంటలను సాగు చేశారు. దీని ద్వారా రైతు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందుతారని అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో ఎల్- 2 రాజశేఖర్, యూనిట్ ఇన్‌చార్జ్ రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న భూ హక్కు రీ సర్వే వేగవంతం చేయండి

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

పిడుగురాళ్ల: జగనన్న భూ హక్కు రీ సర్వేను వేగవంతంగా నిర్వహించి భూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం జేసీ సందర్శించారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న రైతులకు సంబంధించిన దరఖాస్తులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. జేసీ మాట్లాడుతూ మూడో విడత భూ రీ సర్వే నిర్వహించి త్వరగా పూర్తి చేయాలన్నారు. అసైన్‌మెంట్ ల్యాండ్, ప్రభుత్వ భూమికి సంబంధించిన పూర్తిస్థాయి నివేదికలను సిద్ధం చేయాలని, గ్రామ సర్వీస్, ఈనాం భూముల సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు సంబంధించిన మార్పులు, చేర్పులు వంటి కార్యక్రమాలు నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలాగే ఎఫ్‌లైన్ పిటిషన్‌లు, సబ్ డివిజన్ వంటివి త్వరగా పూర్తి చేయాలన్నారు. అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్‌కు సంబంధించి లాండ్ కన్వర్షన్ సంబంధించిన ఫైల్‌లు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని సూచించారు. రికార్డుల పరిశీలన అనంతరం రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. సర్వే పెండింగ్ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేఎఫ్ చక్రవర్తి, డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి అంబటిపై దాడికి నిరసనగా కాపు సంఘాల ఆందోళన



ఆందోళన చేస్తున్న కాపు సంఘాల నాయకులు

గుంటూరు రూరల్: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై ఖమ్మంలో జనసైకోల దాడిని ఖండిస్తూ గోరంట్లలో వంగవీటి రంగా విగ్రహం వద్ద కాపు సామాజిక వర్గం, కాపు సంఘాల నాయకులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం రాస్తారోకో చేశారు. కాపు సంఘం నాయకుడు చిల్లర భవానీకిషోర్ మాట్లాడుతూ కాపు సామాజిక వర్గానికి చెందిన జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును గతంలో టీడీపీ హయాంలో మేడికొండూరులో అడ్డుకొని దాడి చేశారన్నారు. నేడు రాష్ట్ర మంత్రిగా ఉన్న అంబటి రాంబాబుపై ఖమ్మం జిల్లాలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు దాడి చేయడం సరైనది కాదని హితవు పలికారు. కాపు సామాజిక వర్గం నాయకుడుపై చేస్తున్న దాడిని పూర్తిగా ఖండించారు. రాష్ట్ర మంత్రిపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి రౌడీషీట్లు తెరవాల్సిందిగా డిమాండ్ చేశారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ కాపులపై చేస్తున్న దాడిని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాపు నాయకులు జల్లేపల్లి వేణుబాబు, రామిశెట్టి కోటేశ్వరరావు, అంకం సత్యం, గోరంట్ల కాపు సామాజిక వర్గ నాయకులు, రంగా విగ్రహ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రూరల్: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై దాడిచేసిన వారిని అరెస్ట్ చేసి వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేయాలని గుంటూరు మిర్చి యార్డు డైరెక్టర్ బందలపాటి వెంకటేశ్వర్లు(ఇంద్ర) డిమాండ్ చేశారు. శుక్రవారం నగర శివారుల్లోని అమరావతి రోడ్డు ఇన్నర్ రింగ్‌రోడ్డులోని చిల్లీస్ సెంటర్‌లో వంగవీటి మోహన రంగా విగ్రహం వద్ద నిరసన ఆందోళన చేశారు. మంత్రిపై టీడీపీ, జనసేన నాయకులు దాడిని వైఎస్సార్ సీపీ, కాపు సంఘాల నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జల్లేపల్లి వేణుబాబు, బుడంపాడు సొసైటీ చైర్మన్ మీరజ్‌కుమార్ పాల్గొన్నారు.